'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

**నమస్తే తెలంగాణ**

# రక్తపు రాజకీయం

*__తెలంగాణ__ అంటే తెగువ. తెలంగాణ అంటే త్యాగం. తెలంగాణ అంటే సమభావం, సహజీవనం. మలిదశ తెలంగాణ పోరాటానికి అంకురార్పణ గావించిన నాడు ఉద్యమనేత కేసీఆర్ 'గాంధేయం నా గాండీవం' అన్నారు. అహింసాయుత పోరాటంతో దేశానికి స్వాతంత్ర్యం తెచ్చుకున్నాం. రాష్ట్రాన్ని సాధించుకోలేమా అని ధైర్యం చెప్పారు. చివరికి ఆత్మత్యాగానికి సిద్ధపడి గమ్యాన్ని ముద్దాడారు. ఏనాడూ భౌతికదాడులకు పాల్పడమని జనాలను రెచ్చగొట్టలేదు. అందుకే తెలంగాణ ఉద్యమం ప్రపంచవ్యాప్తంగా మన్ననలు పొందింది. తెలంగాణ తెహజీబ్‌ను చూసి అందరూ ముచ్చటపడతారు. రాష్ట్రాన్ని సాధించాం.. పరిపాలనకు అవకాశం ఇవ్వమని ప్రజలను కోరితే సరే అని వరమాల వేశారు. మా పాలన చూసి ఓటేయండని అడిగితే రెండోసారీ బ్రహ్మరథం పట్టారు. ఇప్పుడు ముచ్చటగా మూడోవంతు. అభివృద్ధి పట్టాలెక్కింది. శాంతి, సుహృద్భావం వెల్లివిరిసింది. గమ్యం చేరడానికి ఇంకా చేయాల్సిన పనులెన్నో ఉన్నాయంటూ కేసీఆర్ ప్రజల ముందుకువెళ్లారు. త్వరలో ప్రజలు తీర్పు చెప్తారు. బీఆర్ఎస్ విజయం ఖాయమని సర్వేలన్నీ ఘోషిస్తున్నాయి. సరిగ్గా ఈ మూల మలుపులోనే కాంగ్రెస్ కత్తి దూసింది. స్వచ్ఛమైన తెలంగాణ పాలకుండలో విషం చిమ్మింది. పచ్చగా అలరారుతున్న తెలంగాణ గడ్డ మీద అక్కసుతో చిచ్చు పెట్టేందుకు సిద్ధమైంది.*

*మెదక్ ఎంపీ, దుబ్బాక అసెంబ్లీ బరిలో బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకరరెడ్డిపై జరిగిన దాడిని ఈ నేపథ్యంలోనే చూడాలి మనం. నిస్పృహతో జరిగిన నికృష్టమైన దాడి అది. మాకు అధికారం రాకపోతే మంటలు పెడతాం అన్నట్టుగా తయారైంది కాంగ్రెస్ తీరు. నిజానికి గతంలో సీఎంలను అస్థిరపరిచేందుకు మత కల్లోలాలు సృష్టించిన ఘన చరిత్ర ఆ పార్టీది. ఇప్పుడు అలాంటి కుటిల పన్నాగాలు సాగవు. ఇది మనసున్న మారాజుల తెలంగాణ. ఇక్కడ విషపూరిత కుట్రలకు తావులేదని కాంగ్రెస్ తెలుసుకోవాలి.*

*నిజానికి ధనమదంతో కూడిన కాంగ్రెస్ అక్కసు మార్కు రాజకీయాలపై సీఎం కేసీఆర్ ఎప్పటినుంచో హెచ్చరిస్తూనే ఉన్నారు. పదేండ్లుగా ప్రజలు కాంగ్రెస్‌ను దూరం పెట్టారు. అధికారానికి దూరమైన ఆ పార్టీ బీఆర్ఎస్‌పై ప్రజలు వర్షిస్తున్న అభిమానాన్ని చూసి ఈర్ష్యతో రగిలిపోతున్నది. ఆ పార్టీ నేతలు గులాబీ పాలనపై అవాకులు చెవాకులు పేలడమే పనిగా పెట్టుకున్నారు. బట్టకాల్చి మీదేసే పనులూ చేశారు. జిత్తుల స్థానంలో ఇప్పుడు కత్తులు వచ్చిచేరాయి. ఆవేశకావేశాలు రగులుతుండిన ఉద్యమకాలంలోనూ ఇలాంటి ఘటనలు తెలంగాణలో చోటుచేసుకోలేదు. ఇప్పుడు చల్లని పాలనలో నెత్తురు చిందింది. గాంధీభవన్‌లో గాడ్సేలు చేరిన ఫలితమా ఇది ?సంస్కారహీనులు పెంచుతున్న విషవృక్షమా ఇది? ప్రజాస్వామ్యంలో భౌతికదాడులు ఏ మాత్రం క్షమార్హం కావు. ప్రజలు అన్నీ గమనిస్తూనే ఉన్నారు. సరైన సమయంలో ఓటుతో తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారు.*

# దేశానికి దారిదీపం తెలంగాణ

**(ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో తెలంగాణ మాడల్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కీలకోపన్యాసం పూర్తిపాఠం)**



**భారతదేశానికి తెలంగాణ అభివృద్ధి మాడల్ ఓ దిక్సూచి. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో అతి తక్కువ సమయంలో తెలంగాణ అత్యంత వేగంగా అభివృద్ధి చెందింది. తెలంగాణ సమ్మిళిత, సమగ్రాభివృద్ధి సాధించింది. పరిపాలనలో మానవీయ కోణాన్ని సీఎం కేసీఆర్ ఆవిష్కరిస్తున్నారు. సీఎం కేసీఆర్ అభినవ చాణక్యుడు. అహింసామార్గంలో తెలంగాణను సాధించిన మరో గాంధీజీ. ఒకప్పుడు బీడువారిన భూములను పచ్చని పంట పొలాలుగా తీర్చిదిద్ది దేశానికి సీఎం కేసీఆర్ స్ఫూర్తినిచ్చారు.**

ప్రకృతి ఇచ్చిన వనరులను సద్వినియోగం చేసుకోవడంలో తెలంగాణ చాలా ముందున్నది. నేటి తెలంగాణ శాంతిసామరస్యానికి ప్రతీకగా నిలుస్తుంది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఒక్క మతకల్లోలం కూడా జరగలేదు. తెలంగాణ మాడల్ అంటే ఆర్థిక గణాంకాలు కాదు, అది మారిన తెలంగాణ జీవన స్థితిగతులను తెలియజేస్తుంది. అభివృద్ధి, సంక్షేమం మధ్య సమతుల్యం పాటిస్తూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ముందుకువెళ్తున్నది. అన్నిరంగాల్లో తెలంగాణను ముఖ్యమంత్రి కేసీఆర్ అగ్రగామిగా నిలిపారు. ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్ష కేసీఆర్‌తోనే సఫలమైంది. ప్రత్యేక తెలంగాణ కోసం సుదీర్ఘ పోరాటం సాగిన సంగతి తెలిసిందే. 2001లో సీఎం కేసీఆర్ తెలంగాణ మలిదశ పోరాటాన్ని ప్రారంభించారు. దాంతో 2004లో అప్పటి కేంద్ర ప్రభుత్వం తెలంగాణ అంశాన్ని కామన్ మినిమమ్ ప్రోగ్రామ్‌లో చేర్చింది. ఆ తర్వాత కేసీఆర్ ఉద్యమాన్ని ఉధృతం చేయడంతో 2009లో తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. చివరికి 2014లో ప్రత్యేక రాష్ట్రం సాకారమైంది. అయితే, ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతంలోని 10 జిల్లాల్లో 9 వెనుకబడిన జిల్లాలుండేవి. రైతుల ఆత్మహత్యల్లో రెండో స్థానంలో ఉండేది. 2700 మెగావాట్ల విద్యుత్తు కొరత ఉండేది. విద్యుత్తు లేక పరిశ్రమలను వారంలో రెండు రోజులపాటు మూసివేసేవారు. తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉండేది. తెలంగాణ ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ సమూలమైన సంస్కరణల ద్వారా పూర్తిగా ఆ పరిస్థితులను మార్చివేశారు. విద్యుత్తు మిగులు సాధించాం. ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ రెండో స్థానానికి చేరింది.

2014-15 నుంచి 2022-23 మధ్యకాలంలో స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) 118.2 శాతం పెరుగగా.. తెలంగాణ రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్డీపీ) 155.7 శాతం పెరిగింది. అంటే జాతీయ సగటుకు మించి తెలంగాణ పయనిస్తోంది. జీఎస్డీపీలో దేశంలోనే తెలంగాణ రెండో స్థానంలో ఉన్నది. తెలంగాణ ఏర్పాటయ్యే సమయానికి రూ.1,12,162 ఉన్న తలసరి ఆదాయం 2022-23 నాటికి రూ.3,14,732 కి పెరిగింది. తలసరి ఆదాయం పెరుగుదలలో ఇతర రాష్ట్రాలకు మించి దూసుకెళ్తున్నది. అందరికి సమాన సంపద విధానాన్ని సీఎం కేసీఆర్ అవలంబిస్తున్నారు. ఎన్ఎఫ్ హెచ్ఎస్ 2019-21 ప్రకారం సమానాదాయ పంపిణీలో తెలంగాణ నెంబర్‌వన్‌గా ఉన్నది. 2014లో రాష్ట్రం ఏర్పడినప్పుడు నెగెటివ్ వృద్ధిలో ఉన్న తెలంగాణ 2022-23 నాటికి 15.7 శాతం వృద్ధి సాధించింది. చివరి గింజ వరకు పంటను ప్రభుత్వం కొనుగోలు చేస్తున్నది. రైతుబంధు పేరిట ఏటా ఎకరానికి రూ.10 వేల చొప్పున ఇప్పటివరకు 65 లక్షల మంది రైతులకు రూ.72,815 కోట్లు అందించారు. ఈ చర్య వల్ల రైతులు ప్రైవేటు వ్యక్తుల నుంచి అప్పులు చేసే పరిస్థితి పోయింది. ఎక్కడా లేనివిధంగా రైతులకు ఉచితంగా సాగునీరు అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుంది. రైతాంగానికి 24 గంటల పాటు ఉచితంగా విద్యుత్తు అందిస్తున్నది కూడా కేసీఆరే. తెలంగాణ వ్యవసాయం ఇప్పుడు పండగలా మారింది. ధరణి పోర్టల్ ద్వారా భూ రికార్డుల కంప్యూటరీకరణ చేపట్టి విప్లవాత్మక మార్పునకు తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 99 శాతం భూ రికార్డులు భద్రంగా ఉన్నాయి. తద్వారా అవసరమైన రుణాలను కూడా బ్యాంకులు ఇస్తున్నాయి. మిషన్ కాకతీయ కింద చెరువులు మరమ్మతు చేసుకోవడం వల్ల ఇవాళ రాష్ట్రంలో చెరువులు నిండుకుండల్లా మారాయి. దాంతో భూగర్భజలాలు పెరగడమే కాకుండా మత్స్య సంపద కూడా పెరిగింది.

రికార్డు స్థాయిలో మూడున్నరేండ్ల కాలంలోనే ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకం కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తిచేసిన రికార్డు సీఎం కేసీఆర్ సొంతం. ఆ ప్రాజెక్టు వల్ల రైతులు మూడు పంటలు పండిస్తున్నారు. 2004-2014 మధ్యకాలంలో అప్పటి ప్రభుత్వాలు వ్యవసాయానికి రూ.7,994 కోట్లు ఖర్చుచేస్తే గత తొమ్మిదిన్నరేండ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.1,91,612 కోట్లు ఖర్చుచేసింది. బలమైన విధానాలు రూపొందించడం వల్ల ఇవన్నీ సాధ్యమయ్యాయి. సాగు విస్తీర్ణం 1.31 కోట్ల ఎకరాల నుంచి 2 కోట్ల పైచిలుకు ఎకరాలకు పెరిగింది. ధాన్యం ఉత్పత్తిలో దేశంలోనే రెండో స్థానంలో నిలిచింది తెలంగాణ. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తయితే మరో 50 లక్షల ఎకరాలు సాగులోకి వస్తాయి. 2014లో రూ.62 లక్షల కోట్లుగా ఉన్న రాష్ట్ర బడ్జెట్ ఇప్పుడు రూ.2 లక్షల 94 వేల కోట్లకు చేరుకుంది. తాగునీటిపై రాష్ట్ర ప్రభుత్వం రూ.36 వేల కోట్లు ఖర్చుచేసింది. మిషన్ భగీరథ ద్వారా ప్రతీ ఇంటికి నల్లా కనెక్షన్ కల్పించారు. విద్యుత్తు రంగంలో రూ.38 వేల కోట్లు ఖర్చుచేశారు. 2014లో 7,778 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తయ్యేది. ఇప్పుడది 18,453 మెగావాట్లను ఉత్పత్తి చేసే సామర్థ్యానికి చేరుకున్నది. పునరుత్పాదక విద్యుత్తు ఉత్పత్తిలోనూ తెలంగాణ ఎంతో ముందుంది. తలసరి విద్యుత్తు వినియోగం 2,126 యూనిట్లకు చేరింది. ఇది దేశంలోనే అత్యధికం. కాగా, పర్యావరణ సవాళ్లను అధిగమించడానికి 280 కోట్ల మొక్కలు నాటారు. అందుకు తెలంగాణకు హరితహారం కింద రూ.10 వేల కోట్లను ఖర్చుచేశారు. ప్రతీ గ్రామంలో నర్సరీని నెలకొల్పారు. ప్రపంచంలో ఈ స్థాయి పచ్చదనం అభివృద్ధి ఎక్కడా లేదు.

పరిశ్రమల ఏర్పాటుకు వేగవంతంగా అనుమతులు ఇస్తున్నారు. టీఎస్ ఐపాస్ విధానం ద్వారా కేవలం 15 రోజుల్లోనే అనుమతులు లభిస్తున్నాయి. ఆ లోగా అనుమతులు రాకపోతే పరిశ్రమను స్థాపించుకునే వెసులుబాటును కూడా రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. 2014 నుంచి ఈ ఏడాది జనవరి వరకు రూ.3.31 లక్షల కోట్ల పెట్టుబడులతో 22,100 పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు మంజూరుచేసింది. తద్వారా 22 లక్షల 36 వేల పరోక్ష ఉద్యోగాలను సృష్టించారు. 2014లో రాష్ట్రం నుంచి రూ.57 వేల కోట్ల విలువైన ఐటీ ఉత్పత్తులు ఎగుమతవ్వగా.. ఇప్పుడు రూ.1.83 లక్షలకు చేరాయి. యాపిల్, గూగుల్, మైక్రోసాఫ్ట్, ఫేస్‌బుక్, అమెజాన్ వంటి బహుళజాతి కంపెనీలు సైతం తమ యూనిట్లను హైదరాబాద్‌లో ఏర్పాటు చేశాయి. సీఎం కేసీఆర్ దూరదృష్టితోనే ఇదంతా సాధ్యమైంది.

**అలాగే, వైద్యరంగంలోనూ తెలంగాణ ఎంతో పురోగమించింది. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతంలోని ప్రభుత్వ దవాఖానల్లో కేవలం మూడు డయాలసిస్ కేంద్రాలుండేవి. సీఎం కేసీఆర్ ఇప్పుడు 104 కేంద్రాలకు పెంచారు. రూ.11 వేల కోట్లకుపైగా ఆసరా పథకం కింద 44 లక్షల మందికిపైగా అర్హులకు పింఛన్లు అందించారు. విద్యారంగంలో రంగంలో సమూల మార్పులు తీసుకువచ్చారు. 10 వేల మెడికల్ సీట్లను పెంచారు. ప్రతీ జిల్లా దవాఖానకు అనుబంధంగా మెడికల్ కాలేజీని ఏర్పాటుచేసిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుంది. వెనుకబడిన వర్గాలవారి విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. మహిళా సాధికారతకు ఎంతో కృషి చేస్తున్నారు.**

మహిళా రిజర్వేషన్ల చట్టం పోస్ట్ డేటెడ్ చెక్కులాంటిది. పార్లమెంటు ఆమోదించిన తర్వాత కూడా రిజర్వేషన్ల చట్టం అమలుకావడం లేదు. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ మహిళా రిజర్వేషన్ చట్టం ద్వారా ప్రయోజనాలు పొందాలని ప్రయత్నించింది. ఈ ఐదు రాష్ట్రాల ఎన్నికల నుంచే చట్టాన్ని అమలుచేయాలని డిమాండ్లు వచ్చినప్పటికీ కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదు. కేంద్రానికి చిత్తశుద్ధి లేదు. అన్ని పార్టీలు డిమాండ్ చేసినా ఓబీసీ కోటా కూడా కల్పించలేదు.

# కయ్యానికి 'కత్తి' దూసుడా?

**జీవితంలో ఏదైనా సాధించాలనుకుంటే అన్నీ కోల్పోవడానికి సిద్ధంగా ఉండాలి**



**రాజేంద్రప్రసాద్ చేలిక**
99858 35601

**తెలంగాణ ఆత్మ బలిదానాలు ప్రపంచ చరిత్రలోనే ఓ మరచిపోలేని విషాదం. బతుకుదెరువుకు వచ్చి, స్థానికుల బతుకులనే బజారుపాలు చేసిన దౌర్భాగ్యపు స్థితిని కూడా దశాబ్దాలుగా భరించిన ఘనచరిత్ర ఈ ప్రాంతానిది. సొంతింట్లోనే కిరాయి డబ్బులు చెల్లిస్తూ బతుకులు వెల్లదీసిన దుస్థితి ఇక్కడి ప్రజలది. తమకు పట్టిన గతి మరెవరికి పట్టొద్దని 'తామెలాగు జీవితాలను బుగ్గిపాలు చేసుకున్నాం, కనీసం పిల్లల బతుకులైనా బాగుండాలని మా ప్రాంతాన్ని మాకు వదిలేయండి, మా బతుకులేవో మేం బతుకుతాం' అని సామరస్యంగా పోరాటాలు సాగించిన నేల ఇది. న్యాయ సమ్మతమైన కోరికను ఏ మాత్రం రక్తపాతానికి అవకాశం లేకుండా సాగించారే తప్ప ఎక్కడా ఎరుపెక్కించలేదు. ఆ మాటకొస్తే వాళ్లను వాళ్లు ఆత్మార్పణ చేసుకున్నారే గానీ, ఎదుటి పక్షంపై కనీసం కర్ర కూడా ఎత్తిన ఆనవాళ్లు ఎక్కడా కనిపించవు.**

ఎవరో చేసిన నిర్లక్ష్యానికి గాల్లో కలిసిన ప్రాణాలెన్నో. మొదట 369, రెండో దఫా 1200 పైచిలుకు జీవాలు పిట్టల్లా రాలాయి. శతాబ్దపు ఆరంభంలో మొదలై దశాబ్దంన్నర పాటు సాగిన మలిదశ పోరులో ఒక్కసారైనా రక్తం పారిన సందర్భం లేదు. నచ్చుకున్నా భరించిన సమాజమిది. చెప్తే వినేవారు లేకపోతే తమను తాము నిందించుకున్న ఔదార్యం ఇక్కడిది. రోజురోజుకు పెరుగుతున్న అంతర్గత ఆందోళనలో ఎవరికి చెప్పుకోవాలో అర్థం గాక, ఎవరిని నిందించాలో తెలియని గందరగోళంలో తమను తాము అర్పించుకున్న మహోన్నత అమరమూర్తులు నడిచిన నేల ఇది. త్యాగానికి పర్యాయంగా నిలిచి, తమ ప్రాణాలే ఫలహారంగా సమర్పించారే గానీ, తమను కట్టుబానిసల్లా చూస్తూ కవ్వింపునకు దిగుతున్నా ఈ నేల ఎక్కడా కట్టుతప్పలేదు. ఎవరిపైనా కత్తులు నూరలేదు.



నచ్చిన వాటికోసం బలీయంగా నిలబడటం ఇష్టమనిపించుకుంటుంది, నచ్చని వాటిని సమూలంగా తుంచేయాలనుకోవడం ఇబ్బందిగా మారుతుంది. స్వేచ్ఛను తెలియజేయడానికి ఎంతగా సంతోషిస్తామో.. సంయమనంగా వ్యవహరించాల్సి వచ్చినప్పుడు అంతకుమించిన ఓర్పుతో సాగితేనే మర్యాద అనిపించుకుంటుంది. లేదంటే, ఓ గొప్పాయన చెప్పినట్టుగా హక్కులంటే ఆనందంగా.., బాధ్యతలు అంటే భారంగా వెళ్లదీసేవి అనే భావించాల్సి ఉంటుంది. ఏ విషయమైనా నచ్చడం, నచ్చకపోవడం వారి వారి వ్యక్తిగతాన్ని బట్టే ఉంటుంది. వ్యక్తిస్వామ్యాన్ని డామినేట్ చేసే నచ్చడాలు, నచ్చకపోవడాలు ఇతరులకు ఇబ్బందిగా మార్చితే ప్రజాస్వామ్యానికే ముప్పు వాటిల్లుతుంది. హద్దులు ఎరిగి మసులుకుంటే ఇష్టాయిష్టాలు వాటి వాటి పరిధుల్లోనే రాజ్యమేలుతాయి. రాజ్యమూ పదికాలాలు సుభిక్షంగా నిలుస్తుంది. కాదని కత్తులు దూసినా, నెత్తురు చూసినా పాలనే ప్రశ్నార్థకమవుతుంది. పెద్దరికం పరిహాసమవుతుంది.

ముందు నడిచేవాడు నాయకుడనిపించుకోడు. వెనకుండి నడిపించేవాడు అసలుసిసలు నేతగా కీర్తింపబడతారు. నడిచేవిధానం నచ్చితే వద్దన్నా జనమే అనుసరిస్తారు. నడవడిక తీరు బాగోకుంటే ఉండమని బతిమిలాడినా వీడివెళ్తారు. తెలంగాణ ఉద్యమవేళ ఎవరెవరు ఎక్కడెక్కడున్నారో సమస్త సమాజానికి తెలుసు. రాష్ట్ర సాధన పోరాటంలో ఎవరి పాత్ర ఎంతెంత ఘనమో ఇక్కడి ప్రతి పౌరుడికీ అనుభవమే. ఆ వేళ పరాయి పంచన ఉండి, ప్రాణాలను పణంగా పెట్టిన వారిని పరిహసించిన వారిని ప్రజలు ఎక్కడుంచాలో అక్కడే ఉంచుతారు. అప్పుడు మనస్సుల్లో కోల్పోయిన స్థానాలను రాబట్టుకోవడం కోసం ఎత్తులు, జిత్తులు వేయడం ఓ మార్గమే కావొచ్చు గానీ, కత్తులు, కటారాలు నూరడం సంస్కృతి అనిపించుకోదు. నాయకులు పార్టీలు మారుతారు. పార్టీలు ప్రభుత్వాలను మారుస్తాయి, ప్రభుత్వాలు అల్టిమేట్‌గా ప్రజలకు సాగిలపడాల్సిందే తప్ప వారినే ఏమార్చుతామనుకుంటే చరిత్రహీనులవడం ఖాయం.

ఉద్యమనేత ఒంటరిగా మొదలుపెట్టిన పోరుయాత్రను చూసి, సమస్త తెలంగాణ సమాజం ఒకే తాటిపైకి వచ్చి అనుసరించిందే గానీ భయంతోనో, మరిదేనితోనో బలవంతంగా తెచ్చుకున్నది కాదు. చావు నోట్లో తలపెట్టి అనుకున్నవి సాధించిన వేళ సంబురాలు చేసుకున్న సమాజమే, సల్లగా పాలించమని దీవించిన విషయం తెలిసిందే. మొదటి పర్యాయం మసులుకున్న తీరు, తీర్చిదిద్దిన వైనం నచ్చి మరోమారు కూడా 'మా రేడు'వు నువ్వేనని గద్దె అప్పగించిండ్రు. తాజాగా మూడో పర్యాయం మళ్లీ వాళ్ల ముందుకెళ్లి నిలిచిన సందర్భం. రెండు పర్యాయాలు పాలన సాగించిన వారు ఓ వైపు, పాలన మార్పే లక్ష్యంగా జనాల్లో గడుపుతున్న 'ఆ రెండు పక్షాలు' చెరో దిక్కు అన్నట్టుగా చోటుచేసుకున్న పరిణామాలు ఎంతో ఉత్కంఠకు దారితీస్తున్న సమయం.

అసహనం సహజమే. చూపడానికి మార్గాలనేకం ఉంటాయి. నిందితుడు ప్రత్యక్షంగా కనిపిస్తున్న వేళ నెపం నెట్టాలనే ప్రయత్నమే బాధాకరం. పక్కన నిలబడి, మన బలగంలో కలగాపులగంగా తిరిగినప్పుడే మనోడు, బలహీన క్షణాలను జయించలేక, బహిరంగంగా దాడులతో విరుచుకుపడే వేళ మాత్రం పరాయి.. అనే ధోరణి సాగిస్తున్న నాయకుల తీరు హాస్యాస్పదం. ఏ పార్టీ నాయకుడిపైన జరిగినా దాడి దాడే. ఖండించాల్సిన వేళ కత్తితో చేశారా, కక్షతో చేశారా, సానబట్టినదేనా, చాకచక్యంగానేనా, అనే తీరు విషాదకరం. ఫొటోలు దిగడానికి పోటీపడే ఆరాటం, పోటుపడిన వేళ మాత్రం నెపాన్ని పక్కకు నెట్టేందుకు చేసే యత్నమే విడ్డూరం. తమవాడు కాదని కమలదళం, వాళ్లోడే అని హస్తగళం, ఇలా ప్రత్యక్షంగా దొరికిన ఆధారాలను కూడా పచ్చి అబద్ధంగా మార్చేందుకు యత్నించడం బాధాకరం. నేతలు కదనరంగంలో వైరిపక్షాన్ని ఎదుర్కోవడానికి పన్నాగాలు రచించుకోవాలి. ఎత్తులు పైఎత్తులు వేసుకోవాలి గానీ, నెత్తుటి రాజకీయాలతో నెట్టుకొచ్చే సంస్కృతికి మాత్రం తెరలు తీయడం దిగజారుడుతనమే. అయినా ప్రజలెప్పుడూ వివేకవంతులే. వారి ఆలోచనెప్పుడూ పది తరాల ముందే ఉంటుంది. తమకు ఏ విధానం కావాలో స్పష్టమైన విజన్ ఉన్న వారిని మోసం చేయాలనుకోవడం అత్యాశే. గెలుపోటములను నిర్దయగా వెల్లడించే కీలక ఓటు అస్త్రంతో కాచుక్కూర్చున్న మహాశయులను మోసం చేసే దిశగా ఆలోచనలుంటే ఆ నేతలు ఎప్పటికైనా మట్టికొట్టుకుపోవాల్సిందే. అలాంటి చరిత్ర ఎవరు లిఖించినా చిరిగిపోవాల్సిందే.

అంతిమంగా పార్టీల మధ్య వైరాలు కత్తులు నూరుకునేంత దూరం వెళ్లడం, ఆ దిశగా తీసుకెళ్లే ప్రయత్నాలు చేస్తున్న నేత తీరు అతి హేయం. పాలించాల్సిన వారు రక్తాలు చిందించేలా ప్రేరేపించడం ఓటు విలువను తగ్గించడమే. ప్రజలకు మార్గదర్శకంగా ఉండాల్సిన ఖద్దరు బట్టల పెద్దలు కమురు వాసనతో తిరుగుతామంటే ప్రజలు మాత్రం ఎందుకు ఉపేక్షిస్తారు. ఏ మాటకామాటే నెత్తికెక్కించుకోవాలో, మట్టిలోనే కలుపాలో ఆ ఓటరు మహాశయుడికి పూర్తి స్పష్టత ఉంది. పోట్లతో వాటిని తారుమారు చేసేతీరుకు తెరతీస్తుంటే గమనిస్తూ ఊరుకుంటాడనుకుంటే మూర్ఖత్వమే. సమయం వచ్చినప్పుడు ఓటు పోటు నుఎవరికి దింపాలో వారికి దింపి, మిగతా వారిని ముల్లే మూట సర్దుకోమని చెప్పే లౌక్యం ఆయనకు కూడా తెలుసు. చూస్తున్నారు కదా అని ఎలాపడితే అలా ఆడితే ఆటకట్టించి 'చేతులు' చుట్టేసే రోజు ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలి. అప్పటివరకు నేతలంతా పార్టీల ప్రతిష్ఠలు మరింత దిగజారకుం డా, జనాల్లో ఇంకా చులకన కాకుండా ప్రవర్తిస్తే ఆ కాస్త సింపథీ అయినా ఉంటుందేమో ఆలోచన చెయ్యాలే!

**అంతిమంగా పార్టీల మధ్య వైరాలు కత్తులు నూరుకునేంత దూరం వెళ్లడం, ఆ దిశగా తీసుకెళ్లే ప్రయత్నాలు చేస్తున్న నేత తీరు అతి హేయం. పాలించాల్సిన వారు రక్తాలు చిందించేలా ప్రేరేపించడం ఓటు విలువను తగ్గించడమే.**

**ప్రభాకర్‌రెడ్డి దుబ్బాక నియోజకవర్గ అభ్యర్థిగా ఎన్నికల ప్రచారంలో ఉండగా ఆయనపై కత్తితో ఒక దుండగుడు తీవ్రంగా గాయపరిచిండు. ఆయన ప్రాణాపాయ స్థితిలో యశోదాలో చికిత్స పొందుతున్నారు. ప్రజాస్వామ్యవాదులంతా ఈ ఘటనను ఖండిస్తున్నారు. విలువలు గల రాజకీయాలు కోరుకునే మేధావులంతా ఈ సంఘటన పట్ల దిగ్భ్రాంతిని వ్యక్తపరుస్తున్నారు.**

# బాధాకృష్ణా.. ఇది భావోద్వేగమేనా?



**వేంకటయ్య బొబ్బిశెట్టి**

తెలంగాణలో ఎప్పుడూ ఎన్నికలు హింసాత్మకంగా జరగలేదు. బహుశా ఇదే మొదటిసారి. ఈ హింసాత్మక ఘటనను పరిశీలిస్తే.. కొన్ని స్వీయ ప్రయోజనాల కోసం పనిచేసే తెలంగాణ వ్యతిరేక శక్తుల ప్రేరేపణ దీనివెనుక ఉన్నట్టు తెలుస్తున్నది. తెలంగాణవాదాన్ని వమ్ము చేయాలకునేవారి చిరకాల లక్ష్యపు ఆయుధానికి పదును పెట్టినట్టు, కుట్ర చేసినట్టు కనపడుతుంది. ఈ హత్యాయత్నంపై తెలంగాణ జాతిపిత, ప్రభుత్వాధినేత కేసీఆర్ సహజంగనే చాలా బాధతో స్పందించారు. ఎన్నికల్లో ప్రత్యర్థులను రాజకీయంగానే ఎదుర్కోవాలి గానీ, ఈ విధంగా హత్యారాజకీయాలు చేయటం సరికాదని గర్హించారు. ఈ హింసాత్మక శక్తులకు, ఆ శక్తులను వెనుక నుంచి నడిపిస్తున్నవారిని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. మాకు తిక్కరేగితే తడాఖా చూపిస్తం అని గర్జించారు. అది తెలంగాణ ప్రజల పార్టీ క్యాడర్, దాడిలో తీవ్రంగా గాయపడ్డ నేత కుటుంబసభ్యుల్లో మనోధైర్యాన్ని నింపటం కోసం. అది అవసరం కూడా. ఈ దాడి వెనుక కాంగ్రెస్ ఉన్నదని తేలినందున, కాంగ్రెస్‌ను ప్రతిగా ఓటుతోనే తిప్పికొట్టాలన్నారు. రెచ్చగొట్టకుండా చాలా సంస్కారవంతంగా ప్రజలకు ముఖ్యమంత్రి ఇచ్చిన సందేశం అది. ఇందులో ఎవరికీ అభ్యంతరం ఉండవలసిన అవసరం లేదు. కానీ, రాధాకృష్ణ తన ఆంధ్రజ్యోతిలో ఈ దుర్ఘటనను గురించి రాసిన రాతలు రోత పుట్టిస్తున్నాయి. ఆ విషాద, దురదృష్టకర సంఘటనపై ఏ మాత్రం విచారం వ్యక్తం చేయకపోగా కత్తిపోట్ల అంశం కూడా భావోద్వేగ ప్రసంగాలకు వేదికైందని అంటూ సంఘటన తీవ్రతను చాలా తేలికగా కొట్టిపారేసే విధంగా రాసిండు. ఒక సీనియర్ నేతపై హత్యాప్రయత్నం జరిగితే దానిపై పార్టీ అధినేత స్పందన నీకు భావోద్వేగ ప్రకటన అనిపించిందా బాధాకృష్ణ? కేసీఆర్ ప్రతిదాడులు చేయమని ఎక్కడా పిలుపునివ్వలేదే? ఈ దాడితో మనోస్థైర్యం కోల్పోకుండా ప్రజలు తమ ఓటు ఆయుధంతోనే తిప్పికొట్టమన్నరు. అక్కడ భావోద్వేగాలు రెచ్చగొట్టడమెక్కడుంది? అసలు ఓట్ల కోసం భావోద్వేగాలు రెచ్చగొట్టవలసిన అవసరం తెలంగాణ తెచ్చిన పార్టీకి ఏమున్నది బాధాకృష్ణా?



భూమి పుత్రులది ఎప్పుడూ భావోద్వేగమే బాధాకృష్ణా. తినమరిగిన కోడి ఇల్లెక్కి కూసిందని తెలంగాణలో ఒక సామెత. మా అమాయకత్వాన్ని, సహృదయతను, ఆసరాగా తీసుకొని తెలంగాణలో దశాబ్దాలుగా ఆస్తులు కూడబెట్టుకొని, వనరులను చెరబట్టి, హైదరాబాద్‌లో అక్కడక్కడ తెలంగాణలో ఆర్థిక వ్యాపార సామ్రాజ్యాన్ని స్థాపించిన మీకు తెలంగాణ సాధన ఎప్పుడూ కంటగింపే. ఆ సాధించిన తెలంగాణను విచ్ఛిన్నం చేయటానికి బాలసారె నుంచే కుట్రలు ప్రారంభించింది మీరే కదా బాధకృష్ణా. అందుకు వేదికైంది అంధజ్యోతే కదా బాధాకృష్ణా?

మీ ఏజెంటు అయిన రేవంత్‌రెడ్డితో ఓటుకు నోటు కుట్ర చేయించలేదా? ఇప్పుడు ఆ మీ అనుంగు శిష్యుడికి పట్టం గట్టడానికి, పరోక్షంగా మీ ఏజెంటుతో పాలించటానికే కదా మీరు తెలంగాణను కించపరుస్తున్నరు. మీ ఏజెంటుకు, ఆయన ప్రస్తుతం అధినేతగా ఉన్న ఆ కాంగ్రెస్ పార్టీకి విపరీత పబ్లిసిటీ ఇస్తూ, ఆఖరికి ఆ పార్టీకి చెందిన దుండగుడు బీఆర్ఎస్ నేతపై హత్యాప్రయత్నం చేస్తే కూడా అంధజ్యోతికి అదొక భావోద్వేగ అంశంగానే కనపడటం, అంతకంటే శోచనీయమైన విషయం ఏముంటది బాధాకృష్ణా? మీదైనా, మీ ఏజెంటుదైనా ఒక్కతీరు ఆలోచనే కదా?

2014లో తెలంగాణ సాధకుడికి తెలంగాణను తెలంగాణవాదులే పాలించమని ఇచ్చిన తీర్పు గురించి తెలియదా బాధాకృష్ణా? 2018లో తెలంగాణ సాధన తర్వాత రాష్ట్ర అభివృద్ధి, కాళేశ్వర నిర్మాణం, రైతుబంధు, పింఛన్లు, కల్యాణలక్ష్మి వగైరా సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు మెచ్చి ఇచ్చిన తీర్పు కాదా బాధాకృష్ణా. భావోద్వేగాలు రెచ్చగొట్టి ఎన్నికలు గెలవాల్సిన అవసరం ఎప్పుడూ లేదు, ఎప్పుడూ రాదు కూడా. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనే ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపునకు శ్రీరామరక్ష. కొంతకాలంగా మీ ఆంధ్రజ్యోతి ఇటువంటి తప్పుడు విద్వేష రాతలు రాసి తెలంగాణలో కలసిమెలసి ఉంటున్న ప్రజలను రెచ్చగొడుతున్నది. మేం సహనశీలురం. పరుల పట్ల, పొరుగుల పట్ల సహజ ప్రేమతో ఉండేవాళ్లం. ఆ సుహృద్భావ వాతావరణాన్ని విషపురాతలతో కలుషితం చేయకు బాధాకృష్ణా. నీకేమాత్రం మానవత్వం, పాత్రికేయ విలువలుంటే ప్రభాకరరెడ్డి త్వరగా కోలుకోవాలని కోరుకో.